క్లుప్తంగా

చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న కమాండెంట్ ఆనందరెడ్డి

సిద్దవటం : మండలంలోని భాకరాపేట గ్రామ సమీపంలో ఉన్న ఏపీఎస్పీ 11వ బెటాలియన్ 3వ గేటు వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రం కేంద్రాన్ని గురువారం బెటాలియన్ కమాండెంట్ కె.ఆనందరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రయాణికులకు, పాదచారులకు వారి దాహార్తిని తీర్చేందుకే శుద్ధ జలాలతో చలివేంద్రంను ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో అడిషనల్ కమాండెంట్ నాగేశ్వరప్ప, అసిస్టెంట్ కమాండెంట్లు కె.వెంకటరెడ్డి, పి.ఎన్.డి. ప్రసాద్, థియోఫిలాస్, ఆర్ఐలు, ఆర్ఎస్ఐలు, ఏఆర్ఎస్ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పరీక్షా సామగ్రి పంపిణీ



పరీక్షా సామగ్రి అందుకుంటున్న విద్యార్థిని

సంబేపల్లె : మండల పరిధిలోని దేవపట్ల జిల్లా పరిషత్ పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు పబ్లిక్ పరీక్షా సామగ్రిని ఆ పాఠశాల పూర్వపు విద్యార్థి అశోక్ గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఈ నెల 17 నుంచి పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు రాస్తున్న విద్యార్థులకు ప్యాడ్, పెన్‌లను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సుబ్రమణ్యం, ఉపాధ్యాయులతో కలిసి విద్యార్థులకు పంపిణీ చేశారు.

గీతాపారాయణం.. పుణ్యఫలదాయకం



గీతాపారాయణంలో పాల్గొన్న ఎమ్మెల్యే ఆకేపాటి

రాజంపేట రూరల్ : గీతాపారాయణం నిర్వహింపజేయటం పుణ్యఫలదాయకమని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి అభిప్రాయపడ్డారు. మండల పరిధిలోని ఆకేపాటి ఎస్టేట్‌లో ఎమ్మెల్యే ఆకేపాటి, జ్యోతమ్మ దంపతులు గురువారం శ్రీకృష్ణ గీతాపారాయణం నిర్వహింపజేశారు. ముందుగా పారాయణ దారులు శ్రీకృష్ణ భగవానునికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆకేపాటి భక్తులకు అన్నప్రసాదం అందజేశారు. గీతా పారాయణంలో గడికోట వెంకట సుబ్బారెడ్డి, అనంతపల్లి రామచంద్రయ్య, వెంకటరెడ్డి, సుబ్బారెడ్డి, రమాదేవితోపాటు భక్తులు తదితరులు పాల్గొన్నారు.

ఏఐటీఎస్ ప్రొఫెసర్‌కు మొదటి బహుమతి

రాజంపేట రూరల్ : అంతర్జాతీయ సదస్సులో అన్నమాచార్య ఫార్మసీ కళాశాలలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా ఫార్మసిటికల్ కెమిస్ట్రీ విభాగానికి చెందిన వై.ప్రదీప్‌కుమార్ మొదటి బహుమతి సాధించారని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ డి.స్వర్ణలత తెలియజేశారు. స్థానిక కళాశాలలో గురువారం ప్రదీప్‌కుమార్‌కు అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రదీప్‌కుమార్‌ను కళాశాల వైస్ చైర్మన్ చొప్పా ఎల్లారెడ్డి, ప్రిన్సిపల్ స్వర్ణలతలు ఘనంగా సన్మానించారు.

ముందస్తు హోలీ సంబరాలు




హోలీ సంబరాలలో ఉపాధ్యాయులు, విద్యార్థులు

ఓబులవారిపల్లె : మండల కేంద్రంలోని శ్రీ రిషీ పాఠశాలలో గురువారం ముందస్తు హోలీ సంబరాలు నిర్వహించారు. పాఠశాల కరస్పాండెంట్ టి.యువరాజ మాట్లాడుతూ హోలీ పండుగ మతసామరస్యానికి నిదర్శనమని, అందరూ ఐక్యంగా కల్మషం లేకుండా పండుగను జరుపుకోవాలన్నారు. అనంతరం హోలీ పండుగ ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు.

ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖీ

పుల్లంపేట : సామాజిక తనిఖీలో భాగంగా గురువారం పుల్లంపేట ఎంపీడీఓ సభా భవనంలో 2023 – 24 సంవత్సరానికి సంబంధించి ఉపాధి హామీ పథకం ద్వారా ఖర్చు చేసిన లెక్కలపై ఏపీడీ నందకుమార్ రెడ్డి సామాజిక తనిఖీ నిర్వహించారు. ఇందులో భాగంగా ఫీల్డ్ అసిస్టెంట్ల నుంచి రూ. 2,22,000లు రికవరీ చేయాలని ఆదేశించారు. అలాగే వత్తలూరు ఫీల్డ్ అసిస్టెంట్, టెక్నికల్ అసిస్టెంట్లను తొలగించాలని ఆదేశించారు. అలాగే మండలంలోని 18 మంది రైతులకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు.

ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా ఉషారాణి



లక్కిరెడ్డిపల్లి : లక్కిరెడ్డిపల్లి ఈఓపీఆర్‌డీగా పనిచేస్తున్న ఉషారాణి ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా గురువారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న ఎంపీడీఓ రెడ్డయ్య ఒంటిమిట్ట మండలంలో జరిగిన నిధుల గోల్‌మాల్‌లో ఆయన్ను సస్పెండ్ చేశారు.

సాధనతో 'వంద' సాధ్యమే!

- మంచి మార్కులతో ఉత్తీర్ణతకు గణితం దోహదం చేస్తుందంటున్న ఉపాధ్యాయులు
- 17వ తేదీ నుంచి పదవ తరగతి పరీక్షలు
- ప్రత్యేక తరగతులతో విద్యార్థులకు తర్ఫీదు



తరగతి గదుల్లో చదువుకుంటున్న పదవ తరగతి విద్యార్థులు

రాయచోటి జగదాంబ సెంటర్ : విద్యార్థి దశలో పదవ తరగతి పరీక్షలు చాలా కీలకం. మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధిస్తే భవిష్యత్తులో ఉన్నత చదువులకు సానుకూలంగా ఉంటుంది. ఆరు సబ్జెక్టుల్లో గణితం అంటే విద్యార్థుల గుండెల్లో వణుకు పుడుతుంది. ఎందుకంటే గణితంలోని వాస్తవ సంఖ్యలు, సమీకరణాలు, రేషియో సమీకరణాలు, త్రికోణమితి, త్రిభుజాలు ఈ చాప్టర్లన్నీ విద్యార్థులకు కష్టంగా ఉంటాయి. అయితే మంచి సాధన చేస్తే ఆ గణితంలోనే మిగిలిన ఐదు సబ్జెక్టుల కంటే సులభంగా వందకు వంద మార్కులు సాధించవచ్చని ఉపాధ్యాయులు చెబుతున్నారు. మార్చి 17వ తేదీ నుంచి పదో తరగతి పరీక్షలు ప్రారంభం కానున్నాయి. 24వ తేదీ గణితం పరీక్ష నిర్వహించనున్నారు. మెరుగైన ఉత్తీర్ణతే లక్ష్యంగా ప్రభుత్వ పాఠశాలల్లో వంద రోజుల కార్యాచరణ పేరిట విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు.

గణితంలో మెరుగైన మార్కుల కోసం

వర్గ సమీకరణలు : వీటిలో మూలాలు కనుగొనుటకు – 2 మార్కులు, విచక్షణ కనుగొనుటకు–1 మార్కు ఉంటాయి. వర్గం పూర్తి చేయడం నేర్చుకోవాలి.

నిరూపక రేఖాగణితం : అభ్యాసం–7.2, 7.3లో ప్రశ్నలు నేర్చుకుంటే అందులో 8 మార్కులకు ఒక ప్రశ్న, 2 మార్కులకు ప్రశ్నలు వస్తాయి.

సమితులు : గణితంలోనే ఇవి చాలా సులభమైనవి. ఇందులో 1, 2, 4 మార్కుల ప్రశ్నలు ఒక్కొక్కటి ఉంటాయి. వీటిని అవగాహన చేసుకుంటే 7 మార్కులు మీ సొంతం.

వాస్తవ సంఖ్యలు : ఇందులో కరణీయ సంఖ్యల గురించి నేర్చుకుంటే 8, 4 మార్కుల ప్రశ్నలు వస్తాయి.

గ్రాఫ్స్ : బహుపదులు, రెండు చరరాశులలో రేఖీయ సమీకరణ జతలో ఉంటుంది. అందులో బహుపదులలో వచ్చే గ్రాఫ్స్ ఎంచుకుంటే సులభంగా 4 మార్కులు వస్తాయి.

శ్రేఢులు : ఈ శ్రేఢులతో ముఖ్యంగా సమస్యలపై 8 మార్కులు, అంక శ్రేఢిలో 2 మార్కుల ప్రశ్నలు వస్తాయి. అలాగే ఈ పాఠ్యాంశాలలో, చివరన సూత్రాలలోనూ 4 మార్కుల ప్రశ్న వచ్చే అవకాశం ఉంటుంది. అలాగే సూత్రాలు బిట్స్‌కు ఉపయోగకరంగా ఉంటాయి.

సరూప త్రిభుజాలు : నిర్మాణానికి 8, 4 మార్కులు, వీటిలో మూలపదాలు గీయడం నేర్చుకోవాలి. వీటిలో 1, 2 మార్కుల ప్రశ్నలుంటాయి.

క్షేత్రమితి : సంపూర్ణతల వైశాల్యం, ఘనపరిమాణం సూత్రాలు 8 నేర్చుకుంటే 4, 2 మార్కుల ప్రశ్నలకు ఉపయోగంగా ఉంటుంది. ఇక బిట్స్ కోసం చివరన సూత్రాలను నేర్చుకుంటే సరిపోతుంది.

సంభావ్యత : ఈ పాఠ్యాంశంలో 1, 2, 4 మార్కుల ప్రశ్నలు వస్తాయి. ఇవి ఒక సూత్రానికి సంబంధించినవి మాత్రమే ఉంటాయి. మాత్రం నేర్చుకుంటే ఈ మార్కులను సులువుగా సాధించవచ్చు.

త్రికోణమితి : చివరి అభ్యాసం 11.3, 11.4లో నేర్చుకుంటే 4, 1 మార్కుల ప్రశ్నలు వస్తాయి. వీటిలో పట్టిక నేర్చుకుంటే ఎంతో ఉపయోగం.

సంఖ్యా శాస్త్రం : అంక మధ్యమం, మధ్యగతం, బహుళానికి చెందిన 8 మార్కులు, సూత్రాలను వివరించడానికి 4, 2 మార్కుల ప్రశ్నలుంటాయి.

విద్యార్థులపై మరింత శ్రద్ధ



గణితంలో సాధన చేస్తే అన్ని సబ్జెక్టులలో కంటే వందకు వంద మార్కులు సాధించవచ్చు. తద్వారా ఫలితాలలో మంచి స్కోర్ రావడానికి అవకాశం ఉంటుంది. కష్టంగా ఉన్న చాప్టర్లను ప్రత్యేకంగా బోధిస్తున్నాం. పరీక్షలలో ఎక్కువ మార్కులు వచ్చే చాప్టర్లను విద్యార్థులకు తెలియజేస్తూ వాటిపై ఎక్కువ శ్రద్ధ కనబరుస్తున్నాం. ప్రత్యేక తరగతుల్లో డీ, ఈ గ్రేడులు వచ్చే విద్యార్థులపై మరింత శ్రద్ధ వహిస్తున్నాం. వంద శాతం ఉత్తీర్ణతే ధ్యేయంగా పనిచేస్తున్నాం.

– ఎస్.సదాఖత్‌బాషా, గణిత ఉపాధ్యాయులు, టి.చాకిబండ జెడ్పీహెచ్ఎస్, చిన్నమండెం మండలం

అంగరంగ వైభవంగా కనకాద్రమ్మ తిరునాల



ప్రత్యేక అలంకారంలో దర్శనమిస్తున్న కనకాద్రమ్మ

పుల్లంపేట : మండల పరిధిలోని రామసముద్రం పంచాయతీలో వెలసిన కనకాద్రమ్మ అమ్మవారి తిరునాల గురువారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఉదయాన్నే భక్తులు అమ్మవారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. ఉదయం నుంచి సాయంత్రం 9 గంటల వరకు భక్తులు భారీ సంఖ్యలో అమ్మవారిని దర్శించుకొని కాయాకర్పూరం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ప్రజలకు అసౌకర్యాలు కలగకుండా రాజంపేట రూరల్ సీఐ రమణ, పుల్లంపేట ఎస్ఐ మోహన్ కుమార్ గౌడ్, చిట్వేలి ఎస్ఐ రఘురాం, రాజంపేట ఎస్ఐ లక్ష్మీ ప్రసాద్ రెడ్డి, కోడూరు ఎస్ఐ నవీన్ బాబు గట్టి బందోబస్తు నిర్వహించారు. మధ్యాహ్నం పలువురు దాతలు భక్తులకు అన్నదానం ఏర్పాటు చేసి, ఉచితంగా వాటర్ బాటిల్స్ అందజేశారు. సాయంత్రం నుంచి ఛాందినీ బండ్లు అమ్మవారి చుట్టూ తిరిగాయి. అమ్మవారి తిరునాలలో మిఠాయి దుకాణాలు, శీతల పానీయాలు, చెరుకురసం తదితర దుకాణాలు కొనుగోలుదారులతో కళకళలాడాయి. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.



అమ్మవారి దర్శనానికి బారులు తీరిన భక్తులు

ఘనంగా యంత్రాభిషేకం, దీక్షా హోమం



ఉత్సవ విగ్రహాలను ఊరేగిస్తున్న భక్తులు

నందలూరు : మండలంలోని నాగిరెడ్డిపల్లి మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలోని గొల్లపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన రామాలయంలో గురువారం గొల్లపల్లి గ్రామస్తుల ఆధ్వర్యంలో వేదపండితులు బండాత్మకూరు శివకుమార్ శర్మ బృందం ఉదయం గోపూజ, మహాగణపతి పూజ, యంత్రాభిషేకం, కలశ ప్రతిష్ఠలు, పుణ్యాహవాచనం, మంగళహారతి, మంత్రపుష్పం నిర్వహించారు. ఉత్సవ విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించి ఊరేగించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాద కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. సాయంత్రం అగ్ని ప్రతిష్ఠ, దీక్షాహోమం భక్తి శ్రద్ధలతో జరిపారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.

తెలుగుజాతి విలువైన రత్నం మొల్ల

వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో ఘనంగా మొల్లమాంబ జయంతి



రాయచోటి అర్బన్: మొల్లమాంబ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న శ్రీకాంత్‌రెడ్డి, వైఎస్‌ఆర్‌సీపీ నేతలు

రాయచోటి అర్బన్ : తెలుగుజాతి విలువైన రత్నం మహాకవయిత్రి మొల్లమాంబ అని వైఎస్‌ఆర్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని వైఎస్‌ఆర్‌సీపీ కార్యాలయంలో నిర్వహించిన మొల్ల జయంతి వేడుకలలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాల్మీకి మహర్షి సంస్కృత భాషలో రచించిన రామాయణాన్ని సామాన్యులకు అర్థమయ్యేలా తెలుగులో రచించిన తొలితెలుగు కవయిత్రి మొల్లమాంబ అని పేర్కొన్నారు. మొల్ల 16వ శతాబ్దపు కవయిత్రి అని, ఆమె రచనాశైలి చాలా సరళమైనది, రమణీయమైనది అన్నారు. తాళ్లపాక అన్నమాచార్యులు భార్య తాళ్లపాక తిమ్మక్క తర్వాత అంతటి గొప్ప రెండవ తెలుగు కవయిత్రి మొల్లమాంబ అని అన్నారు. ఈ సందర్భంగా శ్రీకాంత్‌రెడ్డిని కుమ్మర శాలివాహన సంఘం వారు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఫయాజ్‌బాషా, శాలివాహన సంఘం జిల్లా అధ్యక్షుడు నాగేంద్ర, గౌరవాధ్యక్షుడు మేదరపల్లె సుబ్బయ్య, కౌన్సిలర్లు షబ్బీర్, కె.నరసింహారెడ్డి, వైఎస్‌ఆర్‌సీపీ నేతలు పల్లపు రమేష్, శిబ్యాల విజయభాస్కర్, జానం రవీంద్ర యాదవ్, సుగవాసి శ్యామ్‌కుమార్, చిన్న సంజీవ, మహేష్‌రెడ్డి, నాజర్, అశోక్, చంద్ర, జగన్, వాల్మీకి సంఘం నేత గువ్వల బుజ్జి బాబు తదితరులు పాల్గొన్నారు.

తొలి తెలుగు మహిళా కవయిత్రి మొల్ల



మొల్ల చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న నరసింహ, ఉపాధ్యాయులు

రాజంపేట టౌన్ : మొల్లమాంబ తొలి మహిళా కవయిత్రి అని కెఎంఎల్ ఫౌండేషన్ ఛైర్మన్ కెఎంఎల్.నరసింహ తెలిపారు. స్థానిక బాలికోన్నత పాఠశాలలో కెఎంఎల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం కవయిత్రి మొల్ల జయంతి వేడుకను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నరసింహ మాట్లాడుతూ మహిళలు విద్యకు దూరంగా ఉన్న కాలంలో భగవంతున్ని ధ్యానించి కేవలం ఐదు రోజుల్లో సంస్కృతంలోని రామాయణాన్ని మొల్ల తెలుగులోకి అనువదించి శ్రీకృష్ణదేవరాయులచే కీర్తింపబడిందన్నారు. పాఠశాల హెచ్ఎం జయలక్ష్మి మాట్లాడుతూ తమ పాఠశాలకు చెందిన పూర్వ విద్యార్థి కెఎంఎల్.నరసింహ మొల్ల జయంతి వేడుకను ఆయన ఫౌండేషన్ ద్వారా జరపడం ఎంతో ఆనందంగా ఉందని తెలిపారు. అలాగే విద్యార్థినులకు వక్తృత్వ పోటీలు నిర్వహించి బహుమతులను ప్రదానం చేయడం అభినందనీయమని కొనియాడారు. ఈ సందర్భంగా కెఎంఎల్.నరసింహులు రామాయణం గ్రంథాన్ని పాఠశాల లైబ్రరీకి అందజేశారు. తొలుత మొల్ల చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎ.రమణయ్య, ఎస్‌వీ.ప్రసాద్, ఎం.హైమావతి, ఎం.శ్రీదేవి, పి.కాంచన, హెచ్.అమ్ములు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక స్వావలంబనతోనే మహిళల ప్రగతి



గాంధీనగర్ ఎస్టీ కాలనీలో మహిళలను ఉద్దేశించి మాట్లాడుతున్న రాజేశ్వరీ

పెనగలూరు : ఆర్థిక స్వావలంబనతోనే మహిళల ప్రగతి సాధ్యమని పెనగలూరు మండల ఐసీడీఎస్ గ్రేడ్–1 సూపర్‌వైజర్ రాజేశ్వరి అన్నారు. గురువారం స్థానిక గాంధీనగర్ ఎస్టీ కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో మహిళలకు భేటీ బచావో.. భేటీ పడావో కార్యక్రమంలో భాగంగా బ్యాంకు లావాదేవీలు, డిజిటల్ అక్షరాస్యత ఆర్థిక స్వావలంబన తదితర అంశాలపై వివరించారు. మహిళలు అన్ని రంగాలలో రాణిస్తున్నప్పటికీ ఆర్థికంగా పురుషులే ఆధిపత్యం వహిస్తున్నారని ఆమె తెలిపారు. ప్రతి ఒక్కరూ బ్యాంకు అకౌంట్స్ ఓపెన్ చేసి డ్వాక్రా గ్రూప్‌ల ద్వారా లోన్లు తీసుకుని వాటిని సరైన రీతిలో ఖర్చు చేసినప్పుడే ఆత్మగౌరవం సాధ్యమని తెలిపారు. అనంతరం సూపర్‌వైజర్ విజయకుమారి మాట్లాడుతూ మండలంలో ఎక్కువ మంది మహిళలు వంటింటికే పరిమితం కాకుండా వ్యవసాయ పనులు, ఇటుకబట్టి పనులు, ఉపాధి కూలీలుగా ఇంటా బయట పనులు చేస్తూ సమర్థవంతంగా రాణిస్తున్నారని ఆమె కొనియాడారు. మహిళలు వయోజన విద్య కార్యక్రమంలో భాగంగా అక్షరాస్యతను పొందాలన్నారు. సమాజంలో సైబర్ నేరాలు పెరిగిపోతున్నాయని, అలాంటి వాటిపై అప్రమత్తంగా ఉండాలని వారు సూచించారు. కార్యక్రమంలో హరిబాబు, అంగన్‌వాడీ టీచర్లు, స్థానిక మహిళలు పాల్గొన్నారు.

కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పించండి



జగనన్న కాలనీలో ఇంటిని పరిశీలిస్తున్న ఓర్సు భాస్కర్

గాలివీడు : గత ప్రభుత్వంలో జగనన్న కాలనీల పేరుతో ఏర్పాటు చేసిన నిరుపేద గృహాలకు మౌలిక సదుపాయాలను ఏర్పాటు చెయ్యాలని రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం చేనేత అధ్యక్షుడు ఓర్సు వీరభాస్కర్ డిమాండ్ చేశారు. గురువారం మండలంలోని గోరాన్‌చెరువు గ్రామం నూలివీడు మార్గంలో ఉన్న నల్లగుట్ట లేఅవుట్‌ను లబ్ధిదారులతో కలసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నల్లగుట్టలో దాదాపు 140 పట్టాలను మంజూరు చెయ్యగా, అందులో కొందరు ఇంటి నిర్మాణం పూర్తి చేసుకోగా మరికొందరు మధ్యలోనే నిలిపివేశారన్నారు. అలాంటి వారికి పెండింగ్ బిల్లలను చెల్లించి అసంపూర్తిగా ఉన్న ఇళ్లను పూర్తి చేయించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా కాలనీల్లో మౌలిక వసతులు కల్పనే లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.

మామిడిలో సస్యరక్షణ చర్యలతో దిగుబడులు

లక్కిరెడ్డిపల్లి : మామిడిలో పూత, పిందె దశలలో సస్యరక్షణ చర్యలు చేపడితే మంచి దిగుబడులు వస్తాయని ఉద్యాన శాఖ అధికారిణి ఎ.నాగమణి పేర్కొన్నారు. గురువారం మద్దిరేవుల గ్రామంలో మామిడి రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ మామిడిలో తామర పురుగు సోకకుండా గట్లపై కలుపు మొక్కలు లేకుండా తోట చుట్టూ శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఎకరాకు 40 నీలం రంగు జిగురు అట్టల చెట్టు కొమ్మలకు కట్టాలని రైతులకు సూచించారు. తామర పురుగు నివారణకు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. ఈ రెండు నెలలు మామిడి కాయలను కాపాడుకోవాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ చంద్రమ్మ, రైతు సేవా కేంద్రం సిబ్బంది లావణ్య, రైతులు పాల్గొన్నారు.

క్షయ వ్యాధిగ్రస్తులను ఆదరిద్దాం

లక్కిరెడ్డిపల్లి : క్షయ వ్యాధిగ్రస్తులను వెలివేయకుండా వారిని ఆదరించాలని క్షయ వ్యాధి నివారణ సూపర్‌వైజర్ హరి పేర్కొన్నారు. క్షయవ్యాధి వారోత్సవాలలో భాగంగా గురువారం స్థానిక నలంద హైస్కూల్‌లో క్షయవ్యాధి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షయ వ్యాధి లక్షణాలు ఉన్నవారు వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి గల్ల పరీక్ష చేయించుకోవాలన్నారు. క్షయవ్యాధి నిర్ధారణ అయితే ప్రభుత్వం ఆరు నెలలకు సంబంధించిన మందులు ఉచితంగా అందించడమే కాక ప్రతి నెల పౌష్టికాహారానికి రూ. 1000లు ఇస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బాల సుబ్రమణ్యం, కరస్పాండెంట్ చిన్న రమణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు ఓబులేశుకోన తిరునాల

ఒంటిమిట్ట : మండల పరిధిలోని వెంకటాయపల్లి గ్రామంలో నేడు (శుక్రవారం) ఓబులేశు కోన తిరునాల నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి అభిషేకాలు, హోమాలు, పూజా కార్యక్రమాలు జరగనుండగా, మధ్యాహ్నం 3 గంటలకు బండలాగుడు పోటీలు, రాత్రి 7 గంటలకు లక్ష్మీ నరసింహస్వామి కల్యాణోత్సవం చేయనున్నట్లు పేర్కొన్నారు. భక్తులు తిరునాలలో పెద్దసంఖ్యలో పాల్గొనాలని వారు తెలియజేశారు.

మన్నూరు సీఐగా కుళ్లాయప్ప



రాజంపేట రూరల్ : మన్నూరు అప్‌గ్రేడ్ పోలీస్ స్టేషన్ నూతన ఇన్‌స్పెక్టర్‌గా ఎస్.కుళ్లాయప్ప గురువారం బాధ్యతలు చేపట్టారు. కడప వీఆర్ నుంచి ఆయన ఇక్కడ సీఐగా వచ్చారు. సీఐగా విధులు నిర్వహిస్తున్న కె.మహమ్మద్‌అలీ రాయచోటి సైబర్ సెల్ సీఐగా బదిలీపై వెళ్లారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలియజేశారు.

చాదర్ సమర్పించిన గడికోట



దర్గాలో ప్రార్థనలు నిర్వహిస్తున్న శ్రీకాంత్‌రెడ్డి

రామాపురం : సమైక్యతకు, మతసామరస్యానికి ప్రతీక నీలకంఠ్రావుపేట దర్గా ఉరుసు అని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. గురువారం రాత్రి దర్గా ఉత్సవాల సందర్భంగా చాదర్‌ను సమర్పించారు. మాట్లాడుతూ ప్రజలందరూ సుఖసంతోషాలతో జీవించాలని, మతసామరస్యం వెల్లివిరియాలని ఆకాంక్షించారు. భక్తిశ్రద్ధలతో ఉరుసు కార్యక్రమాలను నిర్వహిస్తున్న దర్గా కమిటీ సభ్యులను అభినందించారు. అనంతరం సద్గురు దర్గా మాతాజీ, దర్గా స్వామిజీల మహాసమాధులను దర్శించుకున్నారు.

గృహ నిర్మాణ లబ్ధిదారులకు అదనపు సాయం

గాలివీడు/నందలూరు : గృహ నిర్మాణ లబ్ధిదారులకు అదనపు సాయం అందిస్తున్నట్లు ఎంపీడీఓలు జవహర్ బాబు, రాధకృష్ణంరాజులు తెలిపారు. గురువారం ఆయా మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పీఎంఏవై – ఎన్టీఆర్ గృహ నిర్మాణ లబ్ధిదారులకు ప్రస్తుతం ఇంటినిర్మాణానికి ఇస్తున్న రూ.1.80 లక్షలకు అదనపు సాయంగా ఎస్సీ, బీసీలకు రూ.50వేలు, ఎస్టీలకు రూ.75వేలు మంజూరునకు ఉత్తర్వులు ఇచ్చిందన్నారు. గృహనిర్మాణ లబ్ధిదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకునేలా చూడాలన్నారు. ఇళ్ల నిర్మాణం త్వరితగతిన పూర్తయ్యేలా చూడాలని హౌసింగ్ ఏఈ, పంచాయతీ కార్యదర్శులను, ఇంజనీరింగ్ సిబ్బందిని ఆయన కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతి నెల మూడవ శనివారం నిర్వహిస్తున్న స్వర్ణ ఆంధ్ర- స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమములో ఈ నెల 15న నిర్వహించనున్నట్లు తెలిపారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను కొనడం అమ్మడం విషయంలో ప్రజలు, దుకాణాలదారులను, ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే నష్టాలను వివరించి చైతన్యపరచాలన్నారు. గాలివీడు మండలాన్ని ప్లాస్టిక్ రహిత మండలంగా జిల్లాలో నిలపాలని ఈఓపీఆర్డీ పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఈఓపీఆర్డీ శ్రీనివాసులు, హౌసింగ్ ఏఈ రమేష్ నాయక్, ఏపీఓలు, పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

అసంపూర్తిగా ఉన్న పక్కా గృహాలకు ఆర్థిక సహాయం

రామాపురం/లక్కిరెడ్డిపల్లి : 2019 నుంచి 2024 వరకు పక్కా గృహాలు మంజూరైన అసంపూర్తిగా ఉన్న ఇళ్లలకు ఎస్సీ, ఎస్టీ బీసీలకు అదనంగా ప్రభుత్వం ఆర్థిక సహాయం అందిస్తోందని, ఈ అవకాశాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని హౌసింగ్ డీఈ వెంకటసుబ్బరామయ్య, ఏఈ జనార్దన్ తెలిపారు. గురువారం ఆయా మండలాల్లోని ఎంపీడీఓ కార్యాలయల్లో ఇంజనీరింగ్ అసిస్టెంట్ల సమావేశంలో వారు మాట్లాడారు. వివిధ దశల్లో ఉన్న ఇళ్ల నిర్మాణాలను ఏప్రిల్ 20వ తేదీలోపు పూర్తి చేసుకోవాలని ప్రభుత్వం అదనంగా ఎస్సీ, బీసీలకు రూ. 50 వేలు, ఎస్టీలకు రూ. 75 వేలు అదనంగా అదజేస్తుందన్నారు.

టీబీ రహిత సమాజాన్ని నిర్మిద్దాం



అవగాహన కల్పిస్తున్న వైద్యులు సానే శేఖర్

రాజంపేట రూరల్ : ఆదిలోనే టీబీని గుర్తించి నివారణ మందులు వాడి టీబీ రహిత సమాజాన్ని నిర్మిద్దామని డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ సానే శేఖర్ విద్యార్థులకు పిలుపునిచ్చారు. స్థానిక ఉర్దూ హైస్కూల్‌లోని విద్యార్థులకు టీబీ వ్యాధి నివారణ మహోత్సవాలలో భాగంగా అవగాహన కార్యక్రమాన్ని గురువారం టీబీ పర్యవేక్షకులు పిల్లి జయప్రకాష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సానే శేఖర్ మాట్లాడుతూ 2 వారాలకు పైబడి దగ్గు, రాత్రి పూట జ్వరం రావటం, ఛాతిలో నొప్పి, బరువు తగ్గటం, ఆకలి మందగించటం, గళ్లలో రక్తం పడటం వంటి లక్షణాలు ఉంటే టీబీ వ్యాధి అని అనుమానించాలన్నారు. అటువంటి వారు తక్షణమే తమ పరిధిలోని పీహెచ్‌సీని సంప్రదించి చికిత్స పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో అప్తలామిస్ట్ ఓబిలేసు, సీనియర్ క్లర్క్ యు.సిద్దిరామయ్య, ల్యాబ్ సూపర్‌వైజర్ మల్లికార్జున, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలపై నిర్లక్ష్యం తగదు




పోస్టర్‌ను విడుదల చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

రాజంపేట టౌన్ : విద్యారంగ సమస్యల పరిష్కారంలో కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం వహించడం తగదని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు మదన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. విద్యారంగ సమస్యలపై కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తున్న నిర్లక్ష్య వైఖరికి నిరసనగా ఈనెల 15వ తేదీ విజయవాడలో చేపట్టనున్న దీక్షల పోస్టర్‌ను గురువారం స్థానిక ఎస్ఎఫ్ఐ కార్యాలయంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీఓ నెంబర్ 77ను రద్దు చేస్తామన్న కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పట్టించుకోవడంలేదని దుయ్యబట్టారు. అలానే పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయాలని తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు మనోజ్, హర్షవర్ధన్, అబ్రహాం, యశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

మనల్ని ఎవడ్రా అడిగేది!

- విధుల పట్ల రెవెన్యూ సిబ్బంది అలసత్వం
- మధ్యాహ్నం 12 అయినా కార్యాలయంలో ఖాళీగానే కుర్చీలు



ఖాళీగా కనిపిస్తున్న రెవెన్యూ కార్యాలయం

ఒంటిమిట్ట : మండల రెవెన్యూ కార్యాలయంలో అధికారులు, సిబ్బంది సమయం పాటించడం లేదు. ఉదయం 10 గంటలకు విధులకు హాజరుకావాల్సి ఉండగా మధ్యాహ్నం 12 వరకు ఏ ఒక్కరూ కార్యాలయానికి రాలేదు. ప్రస్తుత తహసీల్దార్ రమణమ్మ సెలవులో ఉండటంతో ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా డిప్యూటీ తహసీల్దార్ గౌరిని నియమించారు. ఆమె గురువారం మధ్యాహ్నం 12 గంటలు అవుతున్నా కార్యాలయానికి రాకపోవడం గమనార్హం. సిబ్బంది సైతం ఆమెనే అనుసరించడంతో కార్యాలయంలో కుర్చీలు ఖాళీగా దర్శనమిచ్చాయి. ఎన్నో ఆశలతో ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చిన వారి సమస్యలు వినేవారు లేకపోవడంతో చేసేదేమీ లేక నిరుత్సాహంతో ప్రజలు వెనుదిరుగుతున్నారు. ఇది గమనించిన రెవెన్యూ అధికారుల తీరుపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. విధుల పట్ల అలసత్వం ప్రదర్శిస్తున్న రెవెన్యూ ఉద్యోగులపై శాఖపరమైన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

సీనియర్ అసిస్టెంట్ వివరణ..

రెవెన్యూ కార్యాలయంలో కుర్చీలు ఖాళీగా కనబడటంపై రెవెన్యూ కార్యాలయం సీనియర్ అసిస్టెంట్ సుబ్బయ్యను వివరణ కోరగా ప్రస్తుత తహసీల్దార్ సెలవులో ఉన్నారన్నారు. ఆమెస్థానంలో డిప్యూటీ తహసీల్దార్ ఇన్‌చార్జ్‌గా వ్యవహరిస్తున్నారని, గురువారం కడప కలెక్టరేట్, ఆర్డీఓ కార్యాలయంలో సమావేశంలో ఉండటంతో వారు ఇక్కడికి రాలేకపోయారన్నారు. ఇక కిందిస్థాయి సిబ్బంది అలసత్వంపై వివరణ అడుగగా సమాధానం దాటవేశారు.